## క్లుప్తంగా

### ముగిసిన వేసవి శిబిరం




చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

గాజువాక: స్థానిక డిజైర్ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు మూడు రోజుల పాటు నిర్వహించిన వేసవి శిబిరం ముగిసింది. చిన్నారులకు సొసైటీ నిర్వాహకులు వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావు మాట్లాడుతూ చిన్నారులకు డిజైర్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సొసైటీ చైర్మన్ రవిబాబు మాట్లాడుతూ తమ సంస్థను అద్దె భవనంలో నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ సహాయ ఆరోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, జేవీవీ ఉపాధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్, వైఎస్సార్‌సీపీ 72వ వార్డు ఇన్‌యార్జి సిరట్ల శ్రీనివాస్, డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణరావు, ప్రతినిధులు రజిని, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న జ్యోతిశ్రీ

కూర్మన్నపాలెం: తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనతను అరికట్టవచ్చునని సుజనా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిశ్రీ పేర్కొన్నారు. యాదవజగ్గరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకు కూరలు,రాగులు వంటి ఆహారాలు తీసుకుంటే పిల్లల తల్లుల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా రాగి పిండితో తయారు చేసిన ఆహారాలు వాటిలో ఉన్న పోషకవిలువలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్‌శ్రీలక్ష్మి,శ్రావణి, పకీర్ తక్యా, యాదవజగ్గరాజుపేట, కాపు జగ్గరాజపేట, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



పాంగి రుక్మిణి

అక్కిరెడ్డిపాలెం: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతానికి చెందిన పాంగి రుక్మిణి (44) తలలో రక్తం గడ్డకట్టడంతో మతి స్థిమితం లేకుండా 2024 జూన్ నుంచి బాధపడుతోంది. దీనికి సంబంధించిన చికిత్స కూడా పొందుతోంది. అయితే ఆమె డిసెంబర్ 4, 2024 ఉదయం 11 గంటల నుంచి కనిపించలేదు. గతంలో రెండు, మూడు సార్లు ఇదే విధంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయి తనకు తానుగా కొన్ని రోజుల తర్వాత వచ్చేది. ఆమె అదృశ్యమైన తర్వాత కుటుంబ వెతికినా ఆచూకీ లభ్యంకాకపోవడంతో ఆమె భర్త కార్తీక్, కుమార్తె సరోజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎత్తు 5 అడుగులు, రంగు ఛామనఛాయ, తెలుగు మాట్లాడుతుందని, ఆమె వివరాలు తెలిస్తే గాజువాక సీఐ 9440796014, పీఎస్ 7386013112, హెచ్‌సీ 9441046802 నంబర్లకు తెలపాలన్నారు.

### మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణం

గోపాలపట్నం: మద్యానికి బానిసై వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురంలో చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాపురం రామాలయం సమీపంలో సీరపు నూకరాజు(39) తల్లి భార్యా పిల్లలతో నివాసముండేవాడు. సోమవారం మధ్యాహ్నం సమయంలో మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. చిరాకు పడుతూ ఇంట్లోకి వెళ్లి పోయాడు. ఇది రోజూ ఉండే గొడవే కదా అని భార్య వాష్‌రూమ్‌కు వెళ్లింది. తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించగా తలుపులు వేసి ఉండడంతో విరిచి చూశారు. ఇంట్లో హుక్కుకు ఉరి వేసుకుని ఉండడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు విచారించారు. మృతికి గల కారణాలపై ఆరా తీశారు. నూకరాజు రాడ్ బెండింగ్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. అయితే మద్యానికి బానిసై భార్య ఎర్నికుమారితో నిత్యం గొడవ పడుతుండేవాడు. అదే మాదిరిగా గొడవ పడి ఉరి వేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

# బార్లా.. వైన్ షాపులు!

- విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- అనుమతులు లేకుండా పర్మిట్ రూమ్‌లు
- నిబంధనలకు తూట్లు..
- పట్టించుకోని ఎక్సైజ్ పోలీసులు

మద్యం దుకాణాలు.. బార్లను తలపిస్తున్నాయి.. అమ్మకాలను పెంచుకునేందుకు మందుబాబులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.. వైన్ షాపుల వద్దే అనధికారికంగా పరదాలు ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్‌లు పెడుతున్నారు.. అంతేకాకుండా మందుబాబులను ఆకర్షించేందుకు ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నారు. మండలంలోని అన్ని వైన్ షాపుల వద్ద ఇదే పరిస్థితి నెలకొని ఉంది. **మద్యం వ్యాపారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా ఎక్సైజ్ శాఖ వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం** గమనార్హం. – పెదగంట్యాడ




పోర్టు వంతెన పక్కన గల వైన్‌షాపు వద్ద ఏర్పాటు చేసిన పరదా



చేపల మార్కెట్ ఎదురుగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు

మండలంలో సిద్ధేశ్వరం, పెదగంట్యాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సమీపంలో.. చేపల మార్కెట్ ఎదురుగా, అరుణా థియేటర్ ఎదురుగా, గంగవరం పోర్టు వంతెన సమీపంలో.. 77వ వార్డు పరిధిలోని నమ్మిదొడ్డి, మదీనాబాగ్ జంక్షన్, గంగవరంలో మద్యం దుకాణాలు ఉన్నాయి.. సదరు దుకాణ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు.. ఒకరితో ఒకరు పోటీ పడుతూ మందుబాబులకు అవసరమైన సౌకర్యాలను బహిరంగంగానే కల్పిస్తున్నారు.. తద్వారా తమ ఆదాయాలను పెంచుకుంటున్నారు. దుకాణాల వద్దే మందు బాబుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయడంతో పాటు వారికి అవసరమైన గ్లాసులు, సోడాలు, వాటర్ ప్యాకెట్లు, తిను బండారాలను ఏర్పాటు చేసి ఆకర్షిస్తున్నారు.దీంతో మద్యం ప్రియులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు నిబంధనలు పాటించకుండా దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైన్ షాపుల యజమానులు ఇచ్చే నెలవారీ మామూళ్లతో పాటు రోజు వారీ బీట్లు తీసుకుంటూ ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖాధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నివాస గృహల పక్కన నిర్వహిస్తున్న పర్మిట్ రూమ్‌లను తొలగించాలని కోరుతున్నారు.

#### అందుబాటులో లేని సీఐ

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. వైన్ షాపుల వద్దే విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న విషయమై ఎక్సైజ్ సీఐ నాగ శ్రీనివాస్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. 'సార్ స్టేషన్‌లో లేరు.. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో మాకు తెలియదం'టూ చెప్పడం విశేషం.

#### పరిసర వాసులకు ఇబ్బంది

కొన్ని వైన్ షాపులకు ఆనుకుని నివాస గృహాలు ఉన్నాయి. వైన్ షాపు యజమానులు ఏర్పాటు చేసే సిట్టింగ్ సౌకర్యం వల్ల మందుబాబులు వేసే చిందులకు సమీప గృహాల్లో నివసించే వారందరూ ఇబ్బందులు పడుతున్నారు. అసలు మండలంలో ఎక్సైజ్ శాఖాధికారులున్నారా లేరా అని వారు వాపోతున్నారు.. ఉంటే ఎందుకు మాకు ఈ పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




చేపల మార్కెట్ ఎదురుగా గల వైన్ షాపు

#### అనధికార పర్మిట్ రూమ్‌లు

**ఎటువంటి అనుమతులు లేకుండా వైన్ షాపుల వద్దే** మందుబాబుల కోసం పరదాలు, పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. మందుబాబులు కూర్చుని అక్కడే మద్యం సేవించేందుకు అనవరమైన టేబుళ్లు, కుర్చీలు, షెల్ఫ్‌లు వేశారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు నిర్ణీత సమయం వరకు మాత్రమే పని చేయాలి. ఆ సమయంలో కేవలం కౌంటర్ల వద్దే మద్యం విక్రయాలు సాగించాల్సి ఉంది. కానీ మండలంలో ఎక్కడా కూడా ఈ నిబంధనలు పాటించడం లేదు.



సిద్ధేశ్వరం వైన్ షాపు పక్కనే మద్యం సేవించేందుకు ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్

## పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

పెదగంట్యాడ: అర్హులైన పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు వంతున స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారినా పేదలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్థలాలు కేటాయించడంతో పాటు అక్కడ ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అమలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వనజాక్షి, అచ్యుతరావు, ఆనంద్, దుర్గారావు, పోతన్న, ఎల్లేటి శ్రీనివాస్, పల్లేటి పోలయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.



పెదగంట్యాడ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

## ఘనంగా శ్రీవారి శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. సోమవారం తిరుమలేశుని జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం కావడంతో శాంతి కల్యాణం చేశారు.

## మర్యాదపూర్వక కలయిక

మహారాణిపేట: శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణను సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఉరుకూటి చంద్రరావు(చందు) మర్యాదపూర్వకంగా కలిశారు. యువజన విభాగం అధ్యక్షుడిగా నియమించిన సందర్భంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు, శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో బొత్స సత్యనారాయణతో పాటు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, గాజువాక సమన్వయకర్త దేవాన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి,కార్పొరేటర్లు చందుకు అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు.



శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉరుకూటి చందు

## స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత

- స్టేషన్‌కు నాయకుల తరలింపు
- పోలీసుల తీరుపై సర్వత్రా ఆగ్రహం



పోలీసుల తీరును నిరసిస్తున్న సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, కార్పొరేటర్ గంగారావు



కార్మికులను, నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఉక్కు స్మృత్యంజలి పార్కు వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. స్టీల్‌ప్లాంట్ సమ్మె నేపథ్యంలో సోమవారం సాయంత్రం గేటు వద్ద బహిరంగ సభ నిర్వహించాలని నాయకులు సన్నాహాలు చేశారు. పోలీసులు బహిరంగ సభకు అనుమతి నిరాకరించారు. దీంతో సమ్మె జయప్రదం చేయాలని కార్మికులకు చెబుదామని నాయకులు రోడ్డు ఇరువైపులా ఉండి అప్పీలు చేయసాగారు. ఈలోగా అక్కడకు పెద్ద ఎత్తున పోలీసులు చేరుకుని నాయకులను నిలవరించే ప్రయత్నించారు. ఈ ప్రయత్నంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. నాయకులు ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావుతో పాటు కొంత మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో కార్మికులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడ స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. శాంతియుతంగా ప్రచారం చేస్తున్న తమతో పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ కార్మికులు బైఠాయించారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ నాయకులకు నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించేశారు.

**పోలీసుల తీరు సరికాదు**

సమ్మె ప్రాధాన్యతపై ప్రచారం చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఉద్యమాలను పోలీసులచే అణగదొక్కాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

## భారత సైనికులకు జేజేలు

మురళీనగర్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన భారత త్రివిధ దళాలకు జేజేలు పలుకుతూ మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు సోమవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో తిరంగా యాత్ర నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొని జవాన్లకు తమ మద్దతు ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. జాతీయ జెండాలను చేతపట్టి యాత్ర సాగించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షురాలు వి.జయప్రభాశర్మ, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత, సంయుక్త కోశాధికారి ఎం.ప్రమీల రావు, సీనియర్ సభ్యులు ఆర్.స్నేహలత, జి.మంగాదేవి, జి.షీలారాణి, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తిరంగా యాత్ర చేస్తున్న వనితా వాకర్స్ క్లబ్ మహిళలు

## వాకర్స్ క్లబ్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో సభ్యత్వ నమోదుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్‌లో శాశ్వత సభ్యులుగా చేరడానికి గతంలో ఉన్న రూ.5 వేలకు బదులుగా రూ.3 వేలు రుసుమును నిర్ణయించామన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ప్రణాళికను వెల్లడించారు. ఈ నెల 25న వీ–డెంటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం, త్వరలో ఉమాపతి మాస్టర్ ఆధ్వర్యంలో చదరంగంపై ఉచిత శిక్షణ, జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం, 7న క్లబ్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు భానుప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి నానుపాత్రుని ప్రకాశరావు, డైరెక్టర్ పైడి గిరిధర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సనపల భానుప్రకాష్

## ఆదర్శవాది సుందరయ్య

అక్కిరెడ్డిపాలెం: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం ఎదురుగా గల కమ్యూనిటీ హాలులో సోమవారం ఘనంగా నిర్వహించారు. కమ్యూనిస్ట్ జె.శ్రీలక్ష్మి తదితరులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్ట్ నాయకుడని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడని కొనియాడారు. గొప్ప ఆదర్శవాదిగా పేరొందిన నాయకుడన్నారు. సీపీఎం జోన్ కమిటీ సభ్యుడు లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జె.కోటేశ్వరరావు, అప్పలరాజు, ఎం.సుబ్బన్న, డి.అమ్మాజీ, వై.లక్ష్మి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమ్యూనిస్ట్ నాయకులు

## ఘనంగా పెంటమాంబ పండగ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి పసుపు,కుంకుమలు సమర్పించారు. అమ్మవారిని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి,58వ వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య దర్శించుకుని పూజలు చేశారు.

## కుటుంబం అదృశ్యం

- లక్కీ డ్రా. చీటీలు నిర్వహిస్తూ నష్టాలు
- ఒత్తిడి భరించలేక పరారైనట్టు కేసు

అక్కిరెడ్డిపాలెం: లక్కీ డ్రా, చీటీలు నిర్వహిస్తూ నష్టాలు రావడంతో పాటు కట్టిన వారు ఒత్తిడి తట్టుకోలేక తండ్రి, భార్య, కుమార్తె అదృశ్యం అయ్యారు. దీంతో కుటుంబ సభ్యురాలి ఫిర్యాదు మేరకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ముగ్గురు మిస్సింగ్ కేసు నమోదైంది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఒక అద్దె ఇంట్లో అప్పాగతుల చిన్నారావు , పార్వతి, రేవతి కుటుంబం నివసిస్తోంది. చిన్నారావు గత కొద్ది కాలంగా స్థానికుల నుంచి లక్కీ డ్రా, చీటీలు నిర్వహిస్తున్నాడు. గత కొద్ది నెలలుగా ఈ వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు, చీటీలు, లక్కీ డ్రాలో డబ్బులు పెట్టిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్నారావు, పార్వతి, రేవతి ఏప్రిల్ 6వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయారు. తమ అల్లుడు, కుమార్తె , మనవరాలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన అనసూయ పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు ముగ్గురు వ్యక్తులు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్కీ డ్రా , చీటీల నిర్వహణలో వచ్చిన నష్టాలు, ఒత్తిడి కారణంగానే వారు పరారయ్యారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.